సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 28 । జనవరి । 2025



రసవత్తరంగా ఆంధ్రా, పంజాబ్ మ్యాచ్

కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్-23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. - 8లో



తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో పని చేస్తున్న సబ్‌స్టాఫ్‌ను తొలగించడంపై ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.230
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 42 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఫ్లైఓవర్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వెంకటేష్

రాయచోటి అర్బన్ : పీలేరు పట్టణంలో జరుగుతున్న ఫ్లైఓవర్ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు టీఎల్. వెంకటేష్ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు విన్నవించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన కలెక్టర్‌ను కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న ఫ్లైఓవర్ రోడ్డు పనుల కారణంగా లాల్ బహదూర్ శాస్త్రి రోడ్డు మిట్టపై నుంచి క్రాస్‌రోడ్డు వరకు, అక్కడ నుంచి చిత్తూరు మార్గంలోని రోడ్డంతా దుమ్ము,ధూళితో నిండిపోయిందన్నారు.దీని వల్ల వాహనాల్లో వెళుతున్నవారు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతుండడంతో ఈపరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వెంటనే ఫ్లై ఓవర్‌రోడ్డు పూర్తిచేయించాలని కలెక్టర్‌రకు విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు శ్రీనివాసులు,నరసింహులు, జంగన్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి రూ.10,24,720 ఆదాయం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ. 10,24,720 ఆదాయం సమకూరింది. సోమవారం టీటీడీ అధికారులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నాలుగునెలలు కాలానికి సంబంధించి రూ. 10,24,720 వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఏఈవోగోపినాథ్, సూపరింటెండెంట్ మనిబాల, టీటీడీ విజిలెన్స్ అధికారులు, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ నాగరాజ, అర్చకులు గోపాలా బట్టర్, కృష్ణస్వామి, అనిల్‌స్వామి, రాజు, గోకుల్‌స్వాములు పాల్గొన్నారు.

అప్‌గ్రేడేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వారు అప్‌గ్రేడేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి కొత్తగా ప్రైవేట్ ప్రాథమిక అప్పర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల అనుమతి కోసం, పాఠశాలల అప్‌గ్రేడేషన్ కోసం దరఖాస్తులను ఆన్‌లైన్లో పంపేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు.ఈ విషయాన్ని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వారు గుర్తించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి



సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికార యంత్రాంగాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి ఆదేశించారు. సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశానుసారం రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీటిని సకాలంలో పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులు తప్పకుండా ఆధార్ జిరాక్స్‌ను తీసుకురావాలని తెలిపారు.

వైభవంగా పల్లకి సేవ



రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకిలో ఊరేగాడు. సోమవారం రాత్రి ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో భక్తులు ఊరేగించారు.

అపరిష్కార వేదిక



‘ఈ వృద్ధురాలి పేరు షేక్ షంషాద్. వయస్సు 73 ఏళ్లు. ఈమెది గాలివీడు మండలంలోని పెద్దూరు. ఈమెకు గుర్రాలమిట్ట వద్ద కొంతమేర స్థల ఉంది. అక్కడ ఉన్న స్థలంపై కొందరి కన్ను పడడంతో ఆక్రమించేందుకు చిన్నపాటి బంకును అడ్డం పెట్టారు. ఇంత వయస్సులోనూ ఈమె స్థానిక అధికారులతోపాటు కలెక్టరేట్‌కు కూడా వచ్చి సమస్యను విన్నవించుకున్నా పరిష్కారం కాలేదని గోడు వెళ్లబోసుకుంటోంది. వెంటనే జిల్లా అధికారులు స్పందించి పరిష్కరించి న్యాయం చేయాలని వేడుకుంటోంది.

- సమస్యల పరిష్కారం కోసం పదేపదే వస్తున్న బాధితులు
- ప్రభుత్వం తక్షణ పరిష్కారం చూపాలని పలువురి వేడుకోలు
- రెవెన్యూ సమస్యలే అధికంగా వస్తున్న వైనం



కలెక్టర్‌తో సమస్యలను చెప్పుకుంటున్న రాజంపేటకు చెందిన దివ్యాంగులు

సాక్షి రాయచోటి : అనునిత్యం సమస్యలతో సతమతమవుతూ సుదూర ప్రాంతాల నుంచి పరిష్కారం కోసం బాధితులు పరుగున వస్తున్నారు. అధికారులకు చెప్పుకుంటే..ఎంతోకొంత ఉపశమనం ఉంటుందన్న ఆలోచనతో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి వైపు అడుగులు వేస్తున్నారు. ఎక్కడెక్కడి నుంచో వ్యయ ప్రయాసలకోర్చి ఉన్నతాధికారులకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే పదేపదే విన్నవించుకుంటున్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదో అర్థం కావడం లేదు.గతంలో వచ్చిన వారే మళ్లీమళ్లీ వస్తూ గోడు వెళ్లబోసుకుంటున్నా పరిష్కారం కాకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహిస్తుండగా...300-350 మంది వరకు బాధితులు వచ్చి ఉన్నతాధికారులకు సమస్యలపై విన్నవిస్తున్నారు.

దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించండి

జిల్లాలోని రాజంపేట డివిజన్ పరిధిలో ఉన్న దివ్యాంగులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విన్నవించారు. నిరుద్యోగ వికలాంగుల సంఘం నాయకుడు బాలాజీ, కృష్ణయ్య, సునీల్‌కుమార్, మనోహర్, చంద్రశేఖర్ తదితరులు కలెక్టర్‌ను కలిసి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ప్రతినెల 3వ శుక్రవారం దివ్యాంగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇక్కడ కూడా సమయం కేటాయించాలని కోరారు. అంతేకాకుండా నిరుద్యోగ దివ్యాంగుల సంక్షేమం కోసం రాజంపేటలో ఒక సాంకేతిక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. నిరుద్యోగ వికలాంగుల ఉపాధి అవకాశాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ, ఉపాధికల్పన ద్వారా సమన్వయంతో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

వచ్చిన వారే మళ్లీ కనిపిస్తున్నారు

రాయచోటిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పదేపదే వచ్చిన వారే కనిపిస్తున్నారు. ఎక్కువగా భూములకు సంబంధించి సమస్యలున్న వారితోపాటు స్థలాల ఆక్రమణకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయి. కొంతమంది భూములకు సంబంధించి కోర్టులో కేసులు నడుస్తున్న తరుణంలో కూడా ఇక్కడికి వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారు. అంతేకాకుండా వ్యక్తిగత సమస్యలకు సంబంధించి కూడా పెద్ద ఎత్తున బాధితులు వస్తున్నారు. అక్కడికక్కడ పరిష్కారానికి నోచుకోకపోవడంతో పలుమార్లు రావాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కడప రాయుడికి బ్రహ్మోత్సవ శోభ

- నేటి నుంచి దేవునికడప ఆలయ బ్రహ్మోత్సవాలు
- 3న కల్యాణోత్సవం, 4న రథోత్సవం
- నేడు అంకురార్పణతో ప్రారంభం



కడప కల్చరల్ : తిరుమల తొలి గడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవానికి వేళయింది. ప్రసన్న వెంకటేశ్వరునిగా, కడప రాయుడిగా పూజలందుకుంటున్న ఆయన బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. మంగళవారం అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాలు ఫిబ్రవరి 7వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ వారం రోజులపాటు ప్రతిరోజు ఓ అలంకారంలో తమ ఇష్టదైవాన్ని చూసుకోవాలని భక్తులు ఆశ పడతారు. ముఖ్యంగా కల్యాణోత్సవం నాడు క్లోంతలుగా చేసుకుని స్వామి, అమ్మవార్లను మనసారా దర్శించుకుంటారు. రథోత్సవం నాడు స్వామి సాక్షాత్తు ఆకాశం నుంచే దర్శనమిస్తున్నాడని భావిస్తూ రథంపైనున్న స్వామికి రెండు చేతులెత్తి గోవిందనామ స్మరణలు చేస్తూ దర్శించుకుంటారు.

ఉత్సవ శోభ

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్నంతా కన్నుల పండువగా అలంకరించారు. రంగురంగుల ముగ్గులు తీర్చారు. ఆలయంతోపాటు దేవునికడప గ్రామమంతా విద్యుద్దీపాలను అలంకరించారు. ఇటు కృష్ణాసర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపుల సీరియల్ సెట్లు అలంకరించి ఆలయం నుంచి మైక్ సెట్లను ఏర్పాటు చేశారు. ఆలయంలో జరుగుతున్న పూజోత్సవాల గురించి వీటి ద్వారా నగర వాసులకు నేరుగా ప్రసారం అయ్యే అవకాశం కల్పించారు. అటు పాత కడప మీదుగా బైపాస్ రోడ్డు వద్ద భారీ ఆర్చిని నిర్మించారు. ఆ ప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీ కటౌట్లు, విద్యుత్ దీప కటౌట్లతో అలంకరించారు.

ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేయాలని వాల్మీకుల వినతి



రాష్ట్రంలోని వాల్మీకి సామాజిక వర్గానికి సంబంధించిన వారందరినీ ఎస్టీ జాబితాలో పునరుద్ధరించాలని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. సంఘం రాష్ట్ర నాయకులు బంగారు కృష్ణమూర్తి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జయశంకర్, నాయకులు బండి పరుశురామ్, దొనికొండ ఆనంద్, ముద్దుల చిన్న నరసింహులు, ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులందరూ వచ్చి క్యాబినెట్‌లో పెట్టి తీర్మానం చేయాలని వారు డిమాండ్ చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. వాల్మీకుల సమస్యలు కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని యానిమేటర్ల దీక్ష



ఏపీ వెలుగు వీఓఏ (యానిమేటర్లు)కు సంబంధించి ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లింపు మొదలుకొని కాల పరిమితి సర్క్యులర్ రద్దు, కోర్టు ఉత్తర్వుల అమలుకై సామూహిక దీక్షలకు పూనుకున్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన యానిమేటర్లు రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని, అక్రమ తొలగింపులు సరికాదని, పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టరేట్ ఎదురుగా నినాదాలతో హోరెత్తించారు. వెంటనే ప్రభుత్వం దిగి వచ్చి తమ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు రాణి, ప్రధాన కార్యదర్శి జి.రెడ్డెప్ప, కోశాధికారి సుబ్రమణ్యం, కృష్ణమ్మ, రెడ్డెప్పరెడ్డి, పవన్, రామసుబ్బయ్య, శంకరమ్మ, నాగసులోచన, శ్వేత, రామాంజులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించడం హేయమైన చర్య

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల



రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల్లో కూటమి నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించడం హేయమైన చర్య అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాగానే చంద్రబాబు స్థానిక నాయకుల ప్రమేయంతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించి వారి పొట్టలను పెట్టుకొన్నారని తెలిపారు.రాష్ట్ర చరిత్రలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇలాంటి చర్యలకు పాల్పడటం కూటమి ప్రభుత్వానికే చెల్లిందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం అందించకపోగా ఎటువంటి నోటీసులు లేకుండా రాజకీయ కక్షతో ఉద్యోగాల నుంచి వారిని తీసేయడం దారుణమని తెలిపారు. మేము అధికారంలో ఉన్నప్పుడు ఎవరికీ ద్రోహం చేయలేదన్నారు. ఉన్న ఉద్యోగాలు తీసేసే సీఎం చంద్రబాబు కొత్తవి ఇస్తారంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే 2 లక్షల మందికిపైగా ఉద్యోగాలు ఇచ్చి యువతీ యువకులకు ఉపాధి కల్పించారని గుర్తు చేశారు.కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు గెజిట్ నోటిఫికేషన్ జారీ

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో కల్లుగీత కులాలకు చెందిన మద్యం షాపులకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం పాత్రికేయులతో కలెట్ మాట్లాడుతూ కల్లుగీత కులాలకు సంబంధించి జిల్లాకు 11 మద్యం షాపులు కేటాయించినట్లు చెప్పారు. ఈనెల 24న లాటరీ పద్ధతిలో కల్లుగీత ఉపకులాలకు షాపులు డ్రా తీసినట్లు తెలిపారు. ఇందులో రాయచోటి మున్సిపాల్టీ గౌడ్ సంఘానికి, రాజంపేట, మదనపల్లి మున్సిపాల్టీలు, రామసముద్రం, వీరబల్లి, నిమ్మనపల్లి, తంబళ్లపల్లి, కలకడలకు ఈడిగ, బి కొత్తకోట రూరల్ గౌడ్, నందలూరు గౌడ్, పీలేరు గౌండ్ల సంఘానికి కేటాయించామన్నారు. అర్హులైన వారు ఫిబ్రవరి 5 సాయంత్రం 5 గంటల్లోపు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రూ. 2 లక్షలు నాన్ రిఫండబుల్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. మున్సిపాల్టీ ప్రాంతాలకు రూ. 21,66, 667, మండల ప్రాంతానికి రూ. 18,33,334 కట్టాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ పరిశీలన చేస్తారని, 7న ఉదయం 10 గంటలకు షాపులకు డ్రా తీయడం జరుగుతుందన్నారు. కల్లుగీత ఉప కులాలకు సంబధించి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మద్యం షాపులకు సంబంధించి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఎక్సైజ్ సూపరిటెండెంట్ జి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఎరుపెక్కిన ఉద్యమం

కడప సెవెన్‌రోడ్స్ : కూటమి పాలనలో అడుగడుగునా ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై ఉద్యమం ఊపందుకుంది. ఎక్కడికక్కడ నిరసన గళం మిన్నంటుతోంది. తాజాగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘చలో కలెక్టరేట్’తో వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప ఎరుపెక్కింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు అధికారం చేపట్టి 8 నెలలైనా ఏ ఒక్కరికీ ఇంటి స్థలం కేటాయించిన పాపాన పోలేదని విమర్శించారు. గతంలో కమ్యూనిస్టులు చేసిన పోరాటాల వల్ల అనాటి ప్రధాని ఇందిరాగాంధీ భూ సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. కానీ నేడు ఫ్రీ హోల్డ్ పేరిట పేదల భూములను పెద్దలకు అప్పగించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏదీ చిత్తశుద్ధి?

గణతంత్ర దినోత్సవం నాడు కనిపించని ప్రజాప్రతినిధులు

సాక్షి రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించుకుంటున్న వేళ...స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకుంటున్న సందర్భంలో ఎక్కడో చిత్తశుద్ధి లోపించినట్లు కనిపిస్తోంది. ఊరు, వాడా పండుగ తరహాలో చేసుకుంటున్న సమయంలో ప్రజాప్రతినిధులు కనిపించకపోవడం వెలితిగా అనిపించింది. గతంలో ఆగస్టు 15తోపాటు జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించే వారని పలువురు చెప్పుకుంటున్నారు. ఈసారి పిలుపులో లోపమో లేక ఆహ్వానాలు బాగానే ఉన్నా ప్రజాప్రతినిధులు రాకపోవడంలో ఆంతర్యమేమిటో తెలియదుగానీ పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రజాప్రతినిధులు కనిపించకపోవడం చర్చకు దారి తీసింది. కేవలం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాత్రమే పోలీసు పరేడ్ మైదానంలో వేడుకలకు హాజరయ్యారు. అంతేకాకుండా ఎట్‌హోమ్‌కు సంబంధించి కూడా ప్రజాప్రతినిధుల జాడే కనిపించలేదు. అక్కడ, ఇక్కడ అంతా అధికారుల హడావుడి కనిపించిందే తప్ప చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి ప్రజాప్రతినిధి వరకు ఎవరూ కనిపించలేదు. టీడీపీ హయాంలో అన్నమయ్యలో తొలిసారిగా జరుగుతున్న వేడుకలకు ఎమ్మెల్యేలు కూడా రాకపోవడం ప్రజాస్వామ్య వాదులను అసంతృప్తికి గురి చేసింది.

పురావస్తు.. ఆంక్షలు మస్తు..

- సౌమ్యనాథాలయ అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు
- టీటీడీలోకి విలీనమైనా మారని పరిస్థితి



చోళుల కాలంనాటి సౌమ్యనాథాలయం



ఆలయంలోని ఉత్తరగాలిగోపురం దగ్గర కూలిపోయిన ప్రాచీన ప్రహరీగోడ

రాజంపేట : దక్షిణాది రాష్ట్రాల్లోని వైష్ణవ ఆలయాల్లో అతిపెద్దది చోళుల కాలం నాటి సౌమ్యనాథాలయం, ఇప్పుడు ఈ గుడి అభివృద్ధికి కేంద్ర పురావస్తుశాఖ గ్రహణం పట్టుకుంది. ఇది భక్తుల మనోగతం. అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రతిశనివారంతోపాటు నిత్యం భక్తుల రాక అధికంగా వస్తున్నా అరకొరసౌకర్యాలు ఆలయంలో ప్రత్యక్షంగా కనిపిస్తాయి. టీటీడీ ఏదీ చేపట్టాలన్న కేంద్రపురావస్తుశాఖ ఆంక్షలతో వెనకడుగు వేస్తున్నారు. కల్యాణవేదిక, పరిపాలనగదులు, పోటు, సిబ్బంది గదులు కూడా నిర్మించడానికి అభ్యంతరాలు పుట్టుకొచ్చాయి. దీంతో రేకులషెడ్ నిర్మితం చేసుకున్నారు. ఆలయం అభివృద్ధి విషయంలో కేంద్రపురావస్తుశాఖ నైజం బహిర్గతమవుతోందని భక్తులు పెదవి విరుస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022లో సౌమ్యనాథాలయం టీటీడీలో విలీనమైంది. ఇకపై ఆలయ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్న భక్తుల ఆశలు అడియాశలయ్యాయి. కేంద్రపురావస్తుశాఖ అభ్యంతరాలు, ఆక్షేపణలే దీనికి కారణంగా నిలుస్తున్నాయి. ఇప్పుడు టీటీడీ కేవలం దేవుని కైంకర్యాలు, దర్శనాలు, పూజలు మాత్రం చూసుకుంటోంది. ఆలయం చుట్టూ ఉన్న ప్రహరీగోడ శిథిలావస్థకు చేరుకుంది. దక్షిణ, ఉత్తర, తూర్పు గాలిగోపురాలతో మిళితమైన ప్రహరీగోడ పై భాగం కూలిపోయినా ఇంతవరకు పునర్నిర్మించలేదు. కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రాచీన గోడ నిర్మాణం ప్రశార్థకమే...

సౌమ్యనాథాలయం ప్రాచీన గోడ 2023లో వైకుంఠఏకాదశి ముందురోజున కూలిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి గోడపునర్నిర్మాణం మరిచారు. గతంలో ఇదే అంశంపై జిల్లా కేంద్రపురావస్తుశాఖ అధికారిని వివరణ కోరగా టెండర్లను పిలిచామన్నారు. నేటి వరకు పనులు జరగలేదు. రాళ్లు, రప్పలతో ఆలయంలో అలాగే ఉండిపోయింది.

చెత్త చెదారంతో నిండిన ప్రాంగణం

సౌమ్యనాథాలయం ప్రాంగణం విశాలమైనది. ఇప్పుడు ఇంది చెత్తచెదారాలతో నిండిపోయింది. పాములు కూడా సంచరిస్తున్నాయి. దీంతో భక్తులు భయపడుతున్నారు. ఆలయం వెనుకవైపు, కాళ్లు,చేతులు శుభ్రం చేసుకునే కుళాయి వద్ద శుభ్రత లేదని, అయినా కేంద్రపురావస్తుశాఖ పట్టించుకోవడంలేదన్న భక్తులు ఆరోపిస్తున్నారు.బ్రాహ్మణవీద్ధిలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగాగా తయారైంది. నలుమూలల నుంచి ఆలయానికి వచ్చే భక్తులు ఆర్కియాలజీ తీరుపై పెదవి విరిస్తున్నారు.

ఉల్లంఘేశ్వరుని ఆలయంకు అడ్డుగా ర థం

చోళుల కాలం నాటి ఉల్లంఘేశ్వరుని ఆలయానికి అడ్డుగా సౌమ్యనాథుని రథం ఉందని ఆలయ నిర్వాహకులు వాపోతున్నారు. ఆర్కియాలజీ వారికి స్థలం ఉందని, అక్కడ అభివృద్ధిచేసి రథాన్ని భద్రపరచుకోవాలని స్థానికులు అంటున్నారు. ఆ దిశగా కేంద్రపురావస్తుశాఖ చర్యలు కనిపించడంలేదు.

దక్షిణగాలిగోపురం కట్టలేని దుస్థితి..

దశాబ్దాలుగా ఆలయ దక్షిణగాలిగోపురం నిర్మితం చేపట్టలేని దుస్థితిలో కేంద్రపురావస్తుశాఖ ఉంది. కేవలం ఆధారాలు లేవన్న కారణంతో నిర్మాణం చేపట్టడం లేదు. గతంలో కేంద్రపురావస్తుశాఖ ఢిల్లీ స్థాయి ఉన్నతాధికారి వీరభద్రరావు వచ్చినప్పుడు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ ప్రాంతం ఎంపీలు కూడా దక్షిణగాలిగోపురం నిర్మించాలని గతంలో కేంద్రపురావస్తుశాఖను కోరారు.

అధ్వానంగా ఆలయ ప్రాంగణం



‘కేంద్రపురావస్తుశాఖ నిర్లక్ష్యం ఆలయ నిర్వహణలో కనిపిస్తోంది. ఆలయ ఉల్లంఘేశ్వరాలయానికి అడ్డంగా రథం పెట్టారు. ఆర్కియాలజి స్థలంలో పెట్టుకుంటే ఆలయం కనిపిస్తుంది. టీటీడీలోకి విలీనమైనా ఆలయ పరిస్థితి మారలేదు. - అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, మాజీ చైర్మన్, సౌమ్యనాథాలయం,


కొరవడిన సమన్వయం



కేంద్ర పురావస్తుశాఖ, టీటీడీ మధ్య సమన్వయం కొరవడింది. ఆలయం బాగోగులు అంతంతమాత్రమే. నిత్యం భక్తులు వస్తున్నారు. వారి సౌకర్యాల కల్పనకు ఆర్కియాలజీ ఆంక్షలు అడ్డుగోడలుగా నిలిచాయి. ఇరుశాఖలు అవగాహనతో ఆలయం అభివృద్ధి చేయాలి - సోమిశెట్టి ప్రభాకర్, స్థానికనేత, నందలూరు గ్రామం

అభివృద్ధిపై దృష్టి సారించాలి

సౌమ్యనాథాలయ నిర్వహణలో ఆర్కియాలజీశాఖ విఫలమైంది. స్వామివారి కైంకర్యాలకే టీటీడీ పరిమితమైంది. ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.



- నాగసుబ్బయ్య, ఆలయ కమిటీ మాజీ సభ్యుడు, నందలూరు

క్లుప్తంగా

ఉచితంగా న్యాయ సాయం



రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్

రాయచోటి టౌన్ : ఉచిత న్యాయ సహాయాన్ని జైలులో ఉన్న నిందితులు, ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. రాయచోటి జైలును ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైల్లో ఉన్న ఖైదీలు, నిందితులతో మాట్లాడారు. ఖైదీలు, నిందితుల కోసం ప్రత్యేక హక్కులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఆహారం రుచికరంగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100కు ఫోన్ చేయాలని చెప్పారు.

ఆసియా షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



మహమ్మద్ యూసుఫ్

మదనపల్లె సిటీ : భారత షూటింగ్ బాల్ జట్టుకు మదనపల్లెకు చెందిన క్రీడాకారుడు ఎంపికయ్యాడు. నేపాల్ దేశంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే రెండవ ఆసియా షూటింగ్ బాల్ పోటీల్లో భారత జట్టు తరఫున ఆంధ్రప్రదేశ్ నుంచి మదనపల్లెకు చెందిన సీనియర్ షూటింగ్ బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసుఫ్‌బాషా ఎంపికయ్యాడు. ఈ మేరకు షూటింగ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 30న ఢిల్లీలో జరిగే శిక్షణలో పాల్గొంటాడు. తనను భారతదేశ జట్టుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందని యూసుఫ్‌బాషా తెలిపారు. యూసుఫ్ ఎంపిక కావడంపై షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పరశురాముడు, జిల్లా కార్యదర్శి గౌతమి నరేష్, అధ్యక్షులు రమణారెడ్డి, ఉపాధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, కోశాధికారి సాయిశేఖర్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

• విద్యార్థుల నిరసన



రాయచోటి అర్బన్ : అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష, విద్యార్థి సంఘాల నేతల నిరసన



రాజంపేట టౌన్ : జూనియర్ కళాశాల వద్ద విద్యార్థి సంఘ నాయకుల ఆందోళన

రాయచోటి అర్బన్/రాజంపేట టౌన్ : రాష్ట్రంలోని నారాయణ, శ్రీ చైతన్య విద్యా సంస్థల తీరుపై వామపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం రాయచోటి, రాజంపేటలో నిర్వహించారు.

రాయచోటి పట్టణంలోని జాతీయ రహదారిపై మాసాపేట వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట జరిగిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. నారాయణ, శ్రీ చైతన్య కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నాయన్నారు. ర్యాంకుల కోసం విద్యార్థులను తీవ్రంగా వేధిస్తూ వారి మరణాలకు కారణమవుతున్నాయంటూ మండిపడ్డారు. విజయవాడ చైతన్య కళాశాల గోశాల క్యాంపస్‌లో ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులను గంటల తరబడి తరగతిగది ముందు నిలబెట్టడంతో ఓ విద్యార్థి మనస్తాపానికి గురై 3వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, నేతలు పవన్‌తోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

- రాజంపేటలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల వద్ద పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటమహేందర్, మదన్‌మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్యలపై కూటమి ప్రభుత్వం ఎలాంటి విచారణ జరుపకుండా, చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తుండటం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నారాయణ, చైతన్య సంస్థలను సీజ్ చేసి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

• ఉద్యోగుల ఆందోళన

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో పని చేస్తున్న పది మంది సబ్‌స్టాఫ్‌ను ఎటువంటి నోటీసులు లేకుండా తొలగించడంపై ఉద్యోగులు సోమవారం పాఠశాల ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఎండీసీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉన్నప్పుడు 24 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఉండే వారని, ప్రస్తుతం 1200 మంది విద్యార్థుల సంఖ్య పెరగడం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం, పనిభారం పెరగడంతో మరో పది మందిని మూడేళ్ల క్రితం విధుల్లోకి తీసుకున్నారన్నారు. వీరందరూ కూడా స్థానికంగా గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన కుటుంబాలకు చెందిన వారన్నారు. అయితే కొత్తగా టెండర్ లేకుండా ఏపీఎండీసీ పాఠశాలను లోపాయికారి ఒప్పందంతో గుత్తేదారుడు అగ్రిమెంట్ చేసుకున్నాడని ఆరోపించారు. వారు రాగానే జనవరి ఒకటో తేది నుంచి పది మంది నాన్ టీచింగ్ స్టాఫ్‌ను తొలగించారని పేర్కొన్నారు. వారికి మూడు నెలల జీతాలు కూడా ఇవ్వలేదన్నారు. తమ కుటుంబ పోషణ గడవడం కూడా కష్టమైందన్నారు. ఇప్పుడు తాము ఎక్కడ ఉద్యోగాలు చూసుకోవాలని ప్రశ్నించారు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. తక్షణమే ఏపీఎండీసీ ఎండీ జోక్యం చేసుకొని వీరిని విధుల్లోకి తీసుకుని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.లలిత, లక్ష్మీప్రసన్న, లక్ష్మీకాంత్, తొలగించిన ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న తొలగించిన నాన్ టీచింగ్ స్టాఫ్

రాష్ట్రస్థాయి గణతంత్ర వేడుకల్లో ప్రతిభ



బాలకృష్ణ



జ్ఞానవర్షిత

రాయచోటి జగదాంబ సెంటర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు గౌరవవందనం సమర్పించే ఎన్‌సీసీ కేడెట్ల బృందంలో రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బాలకృష్ణ, జ్ఞాన వర్షితలు చక్కటి ప్రతిభ కనపరిచారు. రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం కళాశాలకు చాలా గర్వకారణం అని కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత పంకజ్ తెలిపారు. అంతేకాకుండా అన్నమయ్య జిల్లా గణతంత్ర దినోత్సవ వేడుకలో కలెక్టర్‌కు గౌరవవందం సమర్పించిన కంటిన్జెంట్లలో బెస్ట్ కంటిన్జెంట్ అవార్డు, కప్‌ను తమ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరిన విద్యార్థులకు ఎన్‌సీసీ చాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎన్‌సీసీ-బీ, సీ సర్టిఫికెట్ ఫలితాల్లో జిల్లా స్థాయిలోనే మొదటి స్థానంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు నిలుస్తున్నారని, సీ సర్టిఫికెట్ ద్వారా డిఫెన్స్ రంగంలో మంచి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

మదనపల్లె : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని నెమలి నగర్ వడ్డిపల్లికి చెందిన వెంకటరమణ కుమార్తె నాగలక్ష్మి(23) పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా శిక్షణ పొందుతోంది. ఈ నెల 18వ తేదీన హాస్పిటల్‌లో విధులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో 26వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాధవరంలో తాగునీరు కలుషితం



ఆర్‌వో ప్లాంటు వద్ద ఉన్న పిచ్చి మొక్కలు, మురుగు కుంటలు

సిద్దవటం : మండల పరిధి మాధవరం 1, 2, 3 వార్డుల్లోని ఆర్ఓ ప్లాంటు నీరు కలుషితంగా ఉన్నాయని గ్రామస్తులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వం తాగునీటి కోసం ఇక్కడ ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేసింది. కొన్ని రోజుల నుంచి ఆ నీటిలో మురుగు, పురుగులు వస్తున్నాయని గ్రామస్తులు వాపోయారు. అలాగే ప్లాంటు ఆవరణం చుట్టూ పిచ్చిమొక్కలు, బురదకుంటలు ఉన్నాయన్నారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్ కూడా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పశుసంవర్ధక శాఖ అధికారికి పురస్కారం



ప్రశంసా పత్రం అందుకుంటున్న గుణశేఖర్ పిళ్లై

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్ర స్థాయి పురస్కారం అందజేశారు. విజయవాడలో ఆయనకు రాష్ట్ర పశువ సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టి.దామోదర్ నాయుడు జ్ఞాపికతోపాటు ప్రశంసా పత్రం అందించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

అప్పుల బాధతో ట్రాక్టర్ యజమాని ఆత్మహత్య



వెంకటరమణ (ఫైల్)

మదనపల్లె : జీవనోపాధి కోసం వాయిదాల పద్ధతిలో ట్రాక్టర్ కొనుగోలు చేసి, అప్పుల పాలై వాయిదాలు చెల్లించలేనన్న మనస్తాపంతో ట్రాక్టర్ యజమాని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం తెల్లవారుజామున మదనపల్లెలో జరిగింది. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం దొనపల్లె గ్రామానికి చెందిన బోయ కొండప్ప కుమారుడు తలారి వెంకటరమణ(39) పదేళ్ల క్రితం జీవనోపాధికై మదనపల్లెకు వలస వచ్చాడు. డీపీ జగన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య అనిత, కుమారుడు మహేంద్ర(12), కుమార్తె మేఘన (10) ఉన్నారు. 11 నెలల క్రితం ట్రాక్టర్‌ను వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశాడు. ట్రాలీని ఇతరుల వద్ద బాడుగకు తీసుకున్నాడు. భార్యాభర్తలు ఇద్దరూ కలసి ట్రాక్టర్ బాడుగలకు వెళుతూ వారే కూలీలు గానూ పని చేస్తూ జీవించేవారు. ఇటీవల ట్రాక్టర్ బాడుగలు లేకపోవడంతో గత నెల ఈఎంఐ సైతం చెల్లించలేక పోయాడు. ఈ నెలలోనూ ఈఎంఐ చెల్లించ లేనన్న మనస్తాపంతో సోమవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి అక్కడే చింతచెట్టుకు చీరతో ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించేసరికి మృతి చెంది ఉండడంతో తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ కళా వెంకటరమణ విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పీడీలు

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖేలో ఇండియా అస్మిత అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని, ప్రారంభించారు. ఈ పోటీలు వారం రోజుల పాటు జరుగుతాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, మురళీధర్ తెలిపారు. పోటీల్లో శ్రీవేద, చెంబకూరు, వశిష్ట, సీటీఎం, చంద్రమాకులపల్లె, ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాల, కన్నెమడుగు, వాల్మీకిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.30 వేలు ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు జిల్లా డీఎస్‌డీఏ గౌస్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు నరేష్‌బాబు, దేవకమ్మ, రమేష్, ఉమాదేవి, మహేంద్ర, కోచ్ మహేంద్ర, ఆంజనప్ప, బాలాజీ, ధాత్రి స్వాతి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయుల మధ్య ఫ్లెక్సీ వార్

పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు



ఫ్లెక్సీలోని ఫొటోలపై గీతలు గీసిన దృశ్యం

రాయచోటి : రాయచోటి నియోజకవర్గ పరిధిలో ఫ్లెక్సీల కలకలం కొనసాగుతూనే ఉంది. సోమవారం రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో టీడీపీ వర్గీయుల మధ్య ఫ్లెక్సీ వార్ ముదిరి ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకునేందుకు పోలీస్‌స్టేషన్ గడప తొక్కారు. రెండు రోజులుగా గ్రామంలో ఏర్పాటు చేసిన టీడీపీ నాయకుల ఫ్లెక్సీలపై రెండు వర్గాల తెలుగు తమ్ముళ్లు బూతు పురాణాలు వ్యక్తం అయ్యేలా రాతలు రాస్తూ ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారు. సోమవారం ఇదే విషయంపై పార్టీలోని ఇరు వర్గాలు మాటలు పెంచుకొని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు సర్దిచెప్పే కార్యక్రమాలు చేపట్టినట్లు సమాచారం.

రసవత్తరంగా ఆంధ్రా, పంజాబ్ మ్యాచ్



ప్రసాద్, ఆంధ్రా (68 పరుగులు)



పోటీ పడుతున్న ఆంధ్రా, పంజాబ్ జట్లు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్-23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. మూడో రోజు సోమవారం 85 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు 62.1 ఓవర్లలో 162 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఎస్.డి.ఎన్.వి. ప్రసాద్ 68, వాసు 36 పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లు ఆయుష్ గోయల్ 6, క్రిష్ భగత్ 3 వికెట్లు తీశారు. దీంతో 255 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పంజాబ్ జట్టు 43 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. జట్టులోని జష్కరణ్‌సింగ్‌పాల్ 56, ఉదయ్‌శరణ్ 57 పరుగులతో క్రీజులో ఉన్నారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది. కాగా 140 పరుగుల విజయలక్ష్యం పంజాబ్ ముందుంది.

ప్రైవేటు బస్సు బోల్తా

11 మందికి గాయాలు

దువ్వూరు(చాపాడు) : కర్నూలు – కడప జాతీయ రహదారిలోని దువ్వూరు మండలం గుడిపాడు గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. చిత్తూరుకు చెందిన 30 మంది జగన్ ట్రావెల్స్ బస్సును బాడుగకు మాట్లాడుకుని కాశీయాత్రకు వెళ్లారు. యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం తెల్లవారుజామున గుడిపాడు సమీపంలో డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో బస్సు ఎడమ పక్కన రోడ్డు దాటుకుని పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 11 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రులకు 108 వాహనంలో తరలించారు. 30 మందితో ప్రయాణిస్తున్న బస్సు బోల్తా పడిన సమయంలో ఎదురుగా, వెనకాల నుంచి ఎలాంటి వాహనాలు రాకపోడంతో ఘోర రోడ్డు ప్రమాదమే తప్పినట్లయిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వినోద్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్నపల్లెలో భారీ చోరీ

- రూ.12 లక్షల ఆభరణాలు, నగదు అపహరణ
- మరొక ఇంటిలో చోరీ విఫలం




బీరువా నుంచి చిందర వందరగా పడిన వస్తువులు

ఖాజీపేట : ఇంటిలో తాపీగా కాఫీ తాగి, సుమారు 12 లక్షల విలువ గల బంగారం వస్తువులను చోరీ చేసిన సంఘటన ఖాజీపేట మండలంలో సంచలనం రేపింది. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండలం సన్నపల్లె గ్రామంలో తుమ్మలూరు రవీంద్రారెడ్డి, సోముల కొండారెడ్డి ఇళ్లలో సోమవారం తెల్లవారుజామున చోరీ యత్నం జరిగింది. సోముల కొండారెడ్డి ఇంటిలో ఎవరూ లేక పోవడం, అందరూ బెంగళూరులో ఉండటంతో దొంగలు మొదటి కటాంజనం గ్రిల్ పగుల కొట్టి లోపలికి వెళ్లారు. రెండవ వాకిలి సెంట్రల్ లాక్ ఉండటంతో తీసేందుకు ప్రయత్నించారు. రాక పోవడంతో వదిలి కొద్ది దూరంలో ఉన్న తుమ్మలూరు రవీంద్రారెడ్డి ఇంటిలో చోరీ యత్నం చేశారు. ఇంటి ముందు వాకిలి పగులగొట్టి లోనికి వెళ్లారు. బీరువా పైన ఉన్న కీ తీసుకుని లోపల ఉన్న 13 తులాల బంగారం, నగదు రూ.1,50,000 తోపాటు 5 వేల విలువ గల వెండి నగలను చోరీ చేశారు. మొత్తం వాటి విలువ రూ.12 లక్షలు ఉంటుంది. ఫ్రిజ్‌లో ఉన్న పాలను తీసుకుని కాఫీ చేసుకుని తాగి అక్కడే పెట్టి వెళ్లిపోవడం గమనార్హం. తుమ్మలూరు రవీంద్రారెడ్డి తన ఇంటి మేడపై ఉన్న మిద్దెపై రాత్రి బస చేశారు. ఉదయం కిందికి వచ్చి చోరీ జరిగినట్టు గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

క్లూస్ టీం పరిశీలన

చోరీ జరిగినట్లు గుర్తించిన తరువాత ఎవ్వరూ ఇంటిలోకి వెళ్లక పోవడం వల్ల ఖాజీపేట సీఐ మోహన్ క్లూస్ టీం తీసుకు వచ్చి వేలిముద్రలను గుర్తించే యత్నం చేశారు. చోరీ ఎలా జరిగిందని బాధితుల ద్వారా తెలుసుకుని, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

• హార్సిలీహిల్స్‌పై అరకు అందాలు



బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం హార్సిలీహిల్స్ చుట్టూ సోమవారం ఉదయం అరకులో కనిపించే సుందరమైన అందాలు పరచుకున్నాయి. దట్టమైన మేఘాలు నింగి నుంచి కిందకొచ్చి కొండను చుట్టుకుని పాల నురగలా రంజింపజేశాయి. ఈ సమయంలో హార్సిలీహిల్స్ పర్యటనకు వచ్చేసిన సందర్శకులు ప్రకృతి సోయగానికి అబ్బురపడుతూ నింగి-నేల కలిసిపోయినట్టుగా కనిపించిన దృశ్యాన్ని ఆస్వాదించారు.

–టి.షామీర్‌బాషా, బి.కొత్తకోట